సర్కారు బడి సరికొత్తగా..


నాడు-నేడు కింద సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ఆదర్శ పాఠశాల


మినరల్‌వాటర్ తాగుతున్న విద్యార్థులు

- నాడు-నేడుతో మారుతున్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన
- ప్రతి తరగతి గదిలో డెస్కులు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


తరగతి గదిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన డెస్కులు,


పాఠశాలలో ఏర్పాటు చేసిన బాత్‌రూంలు

పగిద్యాల: అరకొర సౌకర్యాలతో అధ్వానంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలు నేడు కళకళలాడుతున్నాయి. సకల సౌకర్యాలతో సరికొత్తరూపును సంతరించుకుంటున్నాయి. కార్పొరేట్ తరహా విద్యాబోధనే లక్ష్యంగా మన బడి నాడు-నేడు కింద ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. నందికొట్కూరు నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 214 ఉన్నాయి. వీటిని వైఎస్ జగన్ సర్కారు నాడు- నేడు కింద దశలవారీగా అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే తొలి విడత కింద 85 పాఠశాలలను రూ. 26.11 కోట్లతో అభివృద్ధి చేసింది. ప్రస్తుతం రెండో విడత కింద రూ. 57.61 కోట్లతో మిగిలిన పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. పలు పాఠశాలల్లో విదార్థుల సంఖ్యకు తగ్గట్టు అదనపు తరగతి గదులు నిర్మిస్తోంది. పగిద్యాల మండలంలో మొత్తం 29 పాఠశాలలు ఉండగా అందులో 27 స్కూళ్లు మొదటి, రెండవ విడతల్లోనే ఎంపికయ్యాయి. వాటిలో దాదాపు రూ. 9.70 కోట్లతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారు.

కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు

ప్రతి ప్రభుత్వ పాఠశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో కొత్త భవనాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రతి స్కూల్‌కు పెయింటింగ్, ప్రహరీ, తరగతి గదిలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, డెస్కులు, పచ్చ బోర్డులు(గ్రీన్‌బోర్డ్స్) ఇంగ్లిష్ ల్యాబ్స్, తాగునీరు, టాయిలెట్లు, బాత్‌రూంలు తదితరవన్నీ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతోంది. పైసా ఖర్చులేకుండా సకల సౌకర్యాలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు పిల్లల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా మొత్తం పాఠశాలలు, మొదటి, రెండు విడతల్లో నాడు నేడు కింద ఎంపికైనవి

మండలం	పాఠశాలల సంఖ	ఎంపిక చేసినవి	విడుదల చేసిన నిధులు (రూ. కోట్లలో)
నందికొట్కూరు	56	51	రూ. 18.65
పగిద్యాల	29	27	రూ. 9.70
కొత్తపల్లి	42	42	రూ. 10.99
జూపాడుబంగ్లా	38	32	రూ. 10.04
మిడుతూరు	49	46	రూ. 16.60

ఆధునిక సౌకర్యాలు కల్పించారు



జగన్ మామయ్య పాలనలో మా పాఠశాల రూపు రేఖలు మారాయి. గతంలో సరైన సదుపాయాలు ఉండేవి కావు. ఇప్పుడు అన్ని సౌకర్యాలతో పాటు మాకు విద్యా కానుక కింద స్కూల్ యూనిఫాం, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూ, టై, బెల్టు, పాఠ్యపుస్తకాలు ఇస్తున్నారు. మేము డెస్కులు మీద కూర్చొని చదువుకుంటున్నాం.

– పరుశురాం, 9వ తరగతి, పడమర ప్రాతకోట.

స్కూల్‌లో మినరల్ వాటర్



మనబడి నాడు -నేడు పథకం కింద పాఠశాలలో రూ. 5 లక్షల విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందులు పడే వారం. ఇప్పుడు స్వచ్ఛమైన నీటిని తాగుతున్నాం. మాలాంటి పేద విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించి చదువు చెప్పిస్తున్న ఘనత జగన్ మామయ్యకే దక్కింది.

– హేమాద్రి, 9వ తరగతి, పడమర ప్రాతకోట

పిల్లల హాజరు శాతం పెరిగింది



2019కు ముందు పాఠశాలల్లో సౌకర్యాలు సరిగ్గా ఉండేవి కావు. ఆర్థికంగా ఇబ్బంది అయినప్పటికీ చాలా మంది పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు పంపించేవారు. మండలంలో 2018–2019లో 3,492 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 2,794 మంది మాత్రమే హాజరయ్యే వారు. ఇప్పుడు స్కూళ్లు బాగా అభివృద్ధి చెందడంతో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. 3, 730 మంది విద్యార్థులు పాఠశాలలకు వస్తున్నారు.

– సుభాన్, ఎంఈఓ, పగిద్యాల

క్లుప్తంగా

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం


కల్యాణోత్సవ వేడుకలో భక్తులు

నందికొట్కూరు: కొణిదేల గ్రామంలో శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల కల్యాణోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ వేడుకను తిలకించారు. గ్రామ సర్పంచ నవీన్, ఎంపీటీసీ సురేష్, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు స్వామి,అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఆలయ పనులు ప్రారంభం


ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: లింగాపురం గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈఓ నాగ ప్రసాద్, మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత శాస్త్రోక్తంగా మూలవిరాట్ అయిన ఆంజనేయస్వామి ప్రతిమను పక్కకు తీశారు. గ్రామస్తులు రూ.20 లక్షలు చందాల ద్వారా సేకరించి దేవదాయ శాఖకు డిపాజిట్ చేశారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చొరవతో ఆ శాఖ మరో రూ.80 లక్షలు మంజూరు చేసింది. మొత్తం రూ.కోటితో ఆంజనేయస్వామి, రామాలయ ఆలయ నిర్మాణాలను చేపట్టినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు.

రూల్స్ అతిక్రమిస్తే జరిమానా


వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

పాములపాడు: వాహనదారులు రహదారి నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదని ఎస్‌ఐ అశోక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద కేజీ రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆటో కెపాసిటీకి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోలను ఆపి మరోసారి పునరావృతమైతే సీజ్ చేస్తానని హెచ్చరించారు. మద్యం, గుట్కా తదితర మత్తు పదార్థాలను సేవించి వాహనాలను నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చునని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఆత్మకూరు: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని చైతన్య పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇళ్ల వద్ద చెత్తను నిల్వ ఉంచరాదని, తడి, పొడిచెత్తను వేరువేరు చేసి మునిసిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఎక్కడబడితేఅక్కడ వేస్తే పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను పాఠశాల హెచ్‌ఎం తాజుద్దీన్, ఉపాధ్యాయులు సన్మానించారు.

నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించండి


కొలతలను నోట్ చేసుకుంటున్న క్వాలిటీ కంట్రోల్ ఏఈ అశ్విని

పగిద్యాల: ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఏఈ అశ్విని కాంట్రాక్టర్లకు సూచించారు. నెహ్రూనగర్ గ్రామ పంచాయతీ అర్లపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద జల్‌జీవన్ మిషన్ పథకం రూ. 18 లక్షల వ్యయంతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. పనులు కొలతల ప్రకారం నాణ్యతగా చేశారా లేదా అని చెక్ చేశారు. తనిఖీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఆమె వెంట మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్పంచ్ రాజేశ్వరి ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బొటానీ ప్రాక్టికల్ పరీక్షకు ఉదయం 20 మంది , మధ్యాహ్నం 20 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి , ప్రిన్సిపాల్ శంకర్ నాయక్, పరీక్షల ఎగ్జామినర్ శివలలిత తెలిపారు.

అడిగిన వారందరికీ ఉపాధి

మిడుతూరు: గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం మండలపరిధిలోని చింతలపల్లి గ్రామంలో కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల జాబ్ కార్డులకు ఆధార్ కార్డును అనుసంధానం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో వలసలను నివారించాలని చెప్పారు. ఉపాధి రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ జయంతి, ఈసీ నరేష్, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పంటనమోదుతో మద్దతు ధర

కొత్తపల్లి: రైతులు సకాలంలో ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశాలు జరిగాయి. ఏఓ నందికుంట రైతు భరోసా కేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. పంట నమోదు, ఆర్‌బీకే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట నారాయణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు, మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీలు ఇవ్వాలి

ఆత్మకూరు: ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు విత్తనాలు, వ్యవసాయ పరికరాలపై మరింత రాయితీ ఇవ్వాలని ఆత్మకూరు రైతు భరోసా చైర్మన్ బైరాపురం మహబూబ్ కోరారు. పట్టణంలోని ఆర్‌బీకేలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం


శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సహకార సొసైటీ చైర్మన్

మిడుతూరు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి అన్నారు. శుక్రవారం నాగలూటి గ్రామంలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం శనగలకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. క్వింటం రూ. 5,335 ప్రకారం కొనుగోలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ధరకు దళారులను విక్రయించి నష్టపోవొద్దని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ కిరణేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు జనార్దన్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, నాయకులు రామనాగేశ్వరరెడ్డి, గోపు సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: రైతులు మద్దతుధరకు శనగలను విక్రయించుకుని లబ్ధిపొందాలని మండల వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి, తర్తూరు సర్పంచు పీఎం నాగిరెడ్డి కోరారు. శుక్రవారం తర్తూరు రైతు భరోసా కేంద్రం వద్ద శనగల కోనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం ఇప్పటికే రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేస్తుందన్నారు.

వన్యప్రాణులను వేటాడితే జైలుశిక్ష


గట్టుతండాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

వెలుగోడు: వన్యప్రాణులను వేటాడితే జైలు శిక్ష తప్పదని వెలుగోడు రేంజ్ అధికారి పట్టాభి హెచ్చరించారు. ఇటీవల గట్టుతండా, జమ్మినగర్ తండాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు జింక పిల్లలను వేటాడి వాటి మాంసాన్ని విక్రయిస్తూ పట్టుబడటంతో శుక్రవారం అటవీ శాఖకు చెందిన 4 రేంజ్‌ల సిబ్బంది ఆయా కాలనీల్లో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. రేంజ్ అధికారి మాట్లాడుతూ..అటవీశాఖ సంపదలో భాగమైన వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ చట్టం ప్రకారం వన్య ప్రాణులను వేటాడటం పూర్తి నిషేధమన్నారు. కార్యక్రమంలో బైర్లూటీ రెంజర్ రామకోటి, నాలుగు రెంజ్‌ల పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య మాట్లాడుతూ , రోజురోజుకు పెరిగిపోతున్న మానవ అవసరాలు జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని చెప్పారు. వన్యప్రాణుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వాటిని హానీ చేయరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపవరంలో వన్యప్రాణి మాంసం విక్రయం!

మహానంది: గోపవరం గ్రామంలో శుక్రవారం వన్యప్రాణి మాంసం విక్రయించినట్లు సమాచారం. అటవీ సమీప గ్రామాల నుంచి దుప్పిమాంసం తీసుకొచ్చి విక్రయించినట్లు తెలిసింది. వన్యప్రాణి వేటగాళ్లకు కొందరు అటవీశాఖ సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుప్పి, కణితి, కొండగొర్రెలు, అడవికోళ్ల మాంసం జోరుగా తీసుకొస్తున్నట్లు సమీప గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు వేటగాళ్లపై దృష్టిసారించి వన్యప్రాణులను వారి బరి నుంచి కాపాడాలని కోరుతున్నారు.కాగా గోపవరంలో వన్యప్రాణి మాంసం విక్రయ ప్రచారంపై విచారణ జరుపుతున్నట్లు అటవీశాఖ ఎఫ్‌ఎస్‌ఓ ఎల్లమ్మ తెలిపారు.

నల్లమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులోని చింతమాను టర్నింగ్ వద్ద శుక్రవారం రాత్రి పెద్ద ప్రమాదం తప్పింది. ప్రకాశం జిల్లాకు చెందిన భూపాలయ్య, కుటుంబ సభ్యులు నంద్యాల పట్టణం నుంచి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీకి బ్రేకులు ఫెయిలయ్యాయి. దాని నుంచి తప్పించుకునేందుకు కారు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించారు. కారును కొండచరియ వద్దకు తీసుకెళ్లి బ్రేకులు వేయడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా కారులో ప్రయాణిస్తున్న ఒకరికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

వారం వ్యవధిలో రెండు ఎడ్లు మృతి


మృత్యువాత పడ్డ ఎద్దును చూపిస్తున్న రైతు పరమటూరు నాగన్న

కొత్తపల్లి: అంతుచిక్కని వ్యాధితో వారం వ్యవధిలోనే ఓ రైతుకు చెందిన రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతుకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిన ఈ ఘటన బండినాయునిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. పరమటూరు నాగన్న అనే రైతుకు నాలుగెకరాల పొలం ఉంది. ఇందులో సేద్యం కోసం రెండు ఎద్దు పెట్టుకున్నాడు. అయితే, నాలుగైదు రోజుల క్రితం ఉన్నట్టుండి ఓ ఎద్దు చనిపోయింది. తాజాగా శుక్రవారం మరో ఎద్దు మృత్యువాత పడింది. అంతుచిక్కని ఈ వ్యాధిపై గ్రామ రైతులు ఆందోళన చెందుతున్నారు.వరుసగా రెండు ఎద్ల మృత్యువాతతో బాధిత రైతుకు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిలింది. కాగా ఈఘటనపై పశువైద్యాధికారిణి భువనేశ్వరి వివరణకోరగా ఎద్దులు అనారోగ్యానికి గురైన వెంటనే స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాలలకు తీసుకురావాలని సూచించారు. బండినాయునిపాలెం రైతు ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించారని, వారు ఏం మందులు ఇచ్చారో తెలియదన్నారు.

సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి

ఆత్మకూరు : మహిళలు తమ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ తిరుపతమ్మ అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రిన్సిపాల్ వెంకటనరసయ్య, వైస్‌ప్రిన్సిపాల్ పద్మావతి బాయి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సుమిత్ర, కళాశాల లెక్చలర్ షేక్‌సోఫియా తదితరులు మాట్లాడారు.

పాత్రికేయులపై దాడులు సరికాదు

నందికొట్కూరు/పాములపాడు: వాస్తవాలను వెలికితీసే పాత్రికేయులపై దాడులకు పాల్పడటం సరికాదని జర్నలిస్టు సంఘాల నాయకులు ఖండించారు. కోడుమూరులో ఓ విలేకరిపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం నందికొట్కూరులో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు నగేష్, నాయకులు, పాములపాడులో పాత్రికేయులు నాగయ్య, మల్లికార్జున మౌలాహుస్సేన్ తదితరులు రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

మహానంది: పంటల సాగులో రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం బోర్డు మెంబర్, మహానంది వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.విజయ భాస్కర్ తెలిపారు. విజ్ఞాన యాత్రలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం నంద్యాల, అయ్యలూరు గ్రామాల్లో పంట పొలాలను సందర్శించారు. ప్రొఫెసర్ మినుము, పత్తి విత్తన నాణ్యత, పంటల సాగులో తెగుళ్లు, లక్షణాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజినీ, డాక్టర్ జయసింహారెడ్డి, డాక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి టెంకాయల సమర్పణ

శ్రీశైలంటెంపుల్: ఏప్రిల్ 11న భ్రమరాంబాదేవికి కుంభోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు , కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు.అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ ప్రధాన పర్యవేక్షకులు శివప్రసాద్, అర్చకులు ,దేవస్థానం ఉద్యోగి సీతారాం నాయక్ దంపతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: త్వరలో జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను, మద్దతుదారులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆత్మకూరు, వెలుగోడు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు , పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.మధుసూధన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థులకు అత్యధిక మెజారిటీని శ్రీశైలం నియోజకవర్గం నుంచి అందించాలన్నారు. ఈ ఎన్నికల్లో సెమీఫైనల్స్ లాంటివని చెప్పారు. ఇందులో పార్టీ అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు అండగా నిలబడి గెలిపించాలని ఎంపీటీసీలను కోరారు. పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ శిల్పాభువనేశ్వరరెడ్డి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఆత్మకూరు వెలుగోడు మండలాల ఎంపీపీలు తిరుపాలమ్మ, లాలం రమేష్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి , పార్టీ మండల , పట్టణ, అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, అంజాద్‌అలీ, అంబాల ప్రభాకర్‌రెడ్డి, రెండు మండలాల ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పాకు సన్మానం

వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన వెలుగోడు పట్టణానికి చెందిన ఎస్‌కే యునస్ ఎమ్మెల్యే శిల్పాకు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు , వెలుగోడు మండలాలకు చెందిన ముస్లింలతో కలిసి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను సన్మానించారు.

- **మహానంది:** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం, సచివాలయాల్లో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహానంది ట్రస్ట్ బోర్డు మెంబర్ గంగిశెట్టి మల్లికార్జునరావు, నాయకులు కందుల రఘురామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **పగిద్యాల:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూసరవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ బోయ మద్దిలేటి మండలంలో ప్రచారం నిర్వహించారు.
- **జూపాడుబంగ్లా:** వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, లింగాపురం సర్పంచు నాగార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమలేశ్వరరెడ్డి మండలంలోని తాటిపాడు గ్రామంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి అభ్యర్థించారు.
- **కొత్తపల్లి:** మండలంలోని ఎర్రమఠం, పాతమాడుగుల గ్రామాల్లో పశ్చిరాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచు బాల ఎల్లయ్య, కో-ఆప్టేడ్ సభ్యుడు మహమ్మద్‌గౌస్ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు.

వలంటీర్ కుటుంబాన్ని ఆదుకుంటాం


అబ్దుల్‌ఖాదర్‌కు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా: గుండెపోటుతో ఈనెల 1 వతేదీన మృతిచెందిన జూపాడుబంగ్లా వలంటీర్ రియాజుద్దీన్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లాకు చేరుకుని మృతుడు తండ్రి అబ్దుల్ ఖాదర్‌ను పరామర్శించారు. తన వంతుగా కొంత ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాల పెద్దన్న, కిరణ్ కుమార్ రెడ్డి సైతం బాధిత కుటుంబానికి కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు మొట్టి బాలయ్య, ఉస్మాన్ బాషా, దేవసహాయం, శివనంద రెడ్డి, డాక్టర్ ఎర్రన్న, ఈఓపీఆర్డీ మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

చెంతకొచ్చిన పెన్షన్ కానుక


అస్వస్థతతో కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆత్మకూరు వడ్లపేటకు చెందిన ఇబ్రహీంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అశోక్

వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో చురుగ్గా సాగుతోంది. వంద శాతం పంపిణీ లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు. కొందరు లబ్ధిదారులు ఆరోగ్య సమస్యలతో ఇతర ప్రాంతాల్లో ఉన్నారని తెలుసుకుని అక్కడికి వెళ్లి పెన్షన్ అందించి అభినందనలు అందుకుంటున్నారు. –ఆత్మకూరు/కొత్తపల్లి


అనారోగ్యంతో నాగర్ కర్నూలు జిలా కుడికేలలో కుమార్తె వద్ద ఉంటున్న కొత్తపల్లి మండలం శివపురం గ్రామానికి చెందిన జి. శ్యామలమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మౌలాలి